
# కాకుల ఇల్లు





ఉదయాన్నే కాఫీ పరిమళాల మీదుగా నిద్రలేచి, అప్పటికే నాన్న. బాల్కనీలో కూర్చొని, గాఢమైన నికోటిన్ పొగల్ని ఆస్వాదిస్తూ, మార్నింగ్ వాక్కు వెళుతోన్న వాళ్ళకు హలో చెబుతూ, మార్నింగ్ వాక్ మా ఇద్దరికీ ఇష్టమైన పని. ఐదారు నెలలుగా మార్నింగ్ వాక్కు రావడం మానివేశాడు నాన్న. విలియమ్ సారును కత్తులతో పొడిచి చంపినరోజు - అదే చివరిసారి మేము మార్నింగ్ వాక్కి కలిసి వెళ్ళటం. దళిత నాయకుడాయన. నాన్నకు బాగా దగ్గరివాడు. సంతాప సభపై రాళ్ళు విసరటం, నాన్న స్కూటర్‌ను తగలబెట్టడం - నాన్న భయపడ్డాడేమో అనిపిస్తుంది.

నాన్నతో మార్నింగ్‌వాక్‌లు గొప్ప ఎడ్యుకేషన్. పొయిట్రీ, పౌరహక్కుల నుంచి టీవీ ఛానల్స్, గజల్సు వరకూ ఎన్నో విషయాలు మాట్లాడుకొనే వాళ్ళం. "ఇప్పుడు నేను నా తలను పోగొట్టుకొన్నాను. ఒట్టి శరీరంగా మాత్రమే మిగిలాను. చేతులు, పొట్ట, వీపు వగైరా - తల మాత్రం లేదు. తలలేని శరీరంతో, పొద్దున్నే మసక వెలుతురులో ఎలా రాను? తలను సంపాదిచ్చుకొన్నాక మళ్ళీ మార్నింగ్ వాక్కు వస్తాను" అనేవాడు.

మార్నింగ్‌వాక్కు బయలుదేరుతూ ఇంటి ముందున్న బర్డ్‌హౌస్ దగ్గర పది నిమిషాలు గడుపుతాను. ఇదివరకు ఇందులోని పక్షులు, నాన్నకు ఉన్న 'అసంఖ్యాకమైన సంతానం.' ఇప్పుడు వీటిని కూడా ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటికి కాసిని గింజలు వేయడం, నీళ్ళు పెట్టడం ఇప్పుడు నా డ్యూటీ అయ్యింది. అవి గింజల్ని తింటూ మెల్లగా కబుర్లలోకి వెళతాయి. ఒకదాని వీపును ఇంకోటి పొడుస్తూ. మా బర్డ్‌హౌస్ చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాళ్ళకు ఆశ్చర్యాన్ని కోపాన్ని తెప్పించే దృశ్యం. అందమైన చిలుకలు, రంగు రంగుల పక్షుల్ని కాదు మేము పెంచేది. మేం పెంచేది కాకుల్ని. "అవి గొప్ప సంస్కృతికి సింబల్స్. మెటాఫర్సు. మినియేచర్ సౌందర్యాలు" నాన్న వాటిని గొప్ప తన్మయంతో వివరిస్తాడు. ఈ కాకుల్ని పెంచటం అమ్మకు బొత్తిగా ఇష్టం లేదు. "మైనాలో, పారకేట్లో, పోనీ పాలపిట్టల్లో.... కాకుండా ఇదేమిటి?" అంటుంది. "వాటికి కాస్త గింజలు వెయొచ్చు కదా" అంటే "ఇంటి ముందు నిలబడ్డ నిరసన సభలా ఉంటుంది వాటిని చూస్తుంటే..." అని విసుక్కొంటుంది. నేను కాకులతో సంభాషిస్తున్న సమయానికి కాఫీ కప్పుతో అమ్మ కూడా అక్కడ ప్రత్యక్షమవుతుంది. "ఏముంటున్నాయే నీ బ్లాకీలు?" అంటుంది

వ్యంగ్యంగా. "రేపటి ప్రపంచం మాదే అంటున్నాయి!" రిటార్టు ఇచ్చి బయటకు నడుస్తాను. "ఈ మార్నింగ్‌వాక్ లింక మానెయ్యకూడదూ! రోజులు బాగాలేవు. చూస్తున్నావుగా గొడవలు" అంటూ వెనక నుంచి అరుస్తుంటుంది.

కింద అంతస్తులో 'కర్మ-104'లో అజంతా ఉంటాడు. "అజంతా కాదు. నా అసలు పేరు ఈడిపస్, తండ్రిని, తల్లిని చంపి పుట్టినవాణ్ణి!" అంటాడు అతను. పుట్టుగుడ్డి. టక్‌టక్ మనిపిస్తూ, ఒక కేన్ చేతికర్ర, కళ్ళకు ఎప్పుడూ ధరించే రేబాన్ కళ్ళజోడు - వయొలిన్లు అమ్మే షాపు అతనిది. అద్భుతంగా వయొలిన్ వాయిస్తాడు. కలల భాషను తెలిసినవాడిని అని చెప్పుకొంటాడు. రాత్రి కలేమిటో చెబితే ఆరోజు జరిగే సంగతులన్నీ చెబుతాడట. అజంతా నాకు మార్నింగ్ వాక్ ఫ్రెండ్. చేతికర్రతో టక్‌టక్ మనిపించుకొంటూ నడుస్తుంటాడు. అతని వెంటనే నేను. రాళ్ళను, గుట్టలను, చెట్లను ముందే పసిగడతాడు. "కళ్ళతో కాదు శబ్దంతో చూస్తాను. అడుగుల కొలతలతో చూస్తాను" అని వివరిస్తుంటాడు. కిలోమీటరు తరువాత ఒక షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. అక్కడ ఆగి, నాన్న కోసం 'హిందూ' కొనుక్కొని - న్యూస్ పేపరు కొట్లో లాటరీ టిక్కెట్లు కూడా ఉంటాయి. వారానికొకసారి అజంతా పేరుతో లాటరీ టిక్కెట్టు కొంటుంటాను. 'నా పేరుతో ఎందుకు?" అని విసుక్కొంటాడు. "గుడ్డివాళ్ళు భగవంతుడి బలహీనతలు. పశ్చాత్తాపంతో బోలెడంత అదృష్టాన్ని మీ వెంట నడిపిస్తాడు" అని నమ్మకంగా చెప్పేదాన్ని. అజంతాకు, నాకు తెలిసి గత ఆరు నెలలుగా అట్లాంటి అదృష్టం ఏదీ ఎదురు కాలేదు.

మా పక్కనున్న అపార్ట్‌మెంట్ 'నిర్వాణ' నుంచి ఒక కుర్రాడు రోజూ ఇదే టైముకు ఇటు వచ్చేవాడు. నాకు సైటు కొట్టడానికి. 'అజంతా మీ బ్రదరా?' అనేవాడు. 'కాదు బాయ్‌ఫ్రెండ్' అంటూ అజంతా చెంపల్ని ముద్దు పెట్టుకొనేదాన్ని. ఆ కుర్రాడి పేరు అనంతో, నారాయణో లేదా రెండూనో - మొన్న వాలెంటైన్స్‌డేనాడు ఒక గ్రీటింగ్, బొకే ఇచ్చి - "నాకు నూడిల్స్, టోస్ట్, బర్గర్‌లు చాలా ఇష్టం. కానీ ఇవాళ నువ్వు మాత్రమే ఇష్టంగా కనిపిస్తున్నావు" అన్నాడు ఎంతో నాటకీయంగా. "నిర్వాణలో ఆరెస్సెస్ కుర్రాళ్ళు ఉన్నారు. వాళ్ళలో ఒకడికి రాఖీ కట్టి నీ గురించి చెబుతా" అని బెదిరించాను. "పెనిస్ అనే మాటను సంస్కృతంలో, అరబ్బీలో, ఫ్రెంచిలో ఏమంటారో చెప్పు. నీ ఫ్రెండ్‌షిప్ చేస్తాను" అన్నాను. అంతే, అనంతో, నారాయణో మళ్ళీ కనబడలేదు.

షాపింగ్ కాంప్లెక్స్ దాటినాక ఖాళీ మైదానం ఉంది. రాళ్ళగుట్టలు, పొదలు, వాటి మధ్యన రోడ్డు. ఆ రోడ్డు మొదట్లోనే విలియమ్ సారును చంపివేసింది. గుట్టల మధ్య ఆయన శవం ఒక రోజంతా పడి ఉంది. హత్య జరిగిన

వారానికి చాలామంది కవులు, రచయితలు, దళిత నాయకులు అక్కడ నుంచే పెద్ద ఊరేగింపు నడిపారు.

రాళ్ళగుట్టలు దాటినాక కార్పొరేషన్ వాళ్ళ పార్కు ఉంది. ఆ పార్కు గొప్ప సెక్యులర్ ప్రదేశం. క్రికెట్ ఆటలకది మంచి చోటు. చుట్టూ బెంచీలపై వాకింగ్‌కు వచ్చిన పెద్దవాళ్లంతా కూర్చొని ముచ్చట్లు చెప్పుకొంటారు. ప్రస్తుతం అక్కడ పోలీస్ కాంప్ ఉంది. టెంటు ముందు యూనిఫారం తీసివేసిన పోలీసు - ఆవులిస్తూ ప్రపంచంవైపు అపనమ్మకంతో చూస్తున్నాడు.

"ఇక చాలు కాళ్ళు నొప్పులు వస్తున్నాయి" అంటూ ఒకచోట కూలబడ్డాడు అజంతా. "రోడ్డుపై చెట్లు కూలుతున్న దృశ్యాలేమైనా కనిపిస్తున్నాయా" అన్నాను. అజంతాకి అర్థం కాలేదు. "నీ పేరుతో ఒక మహాకవి ఉన్నాడు. ఆయనక్కూడా నీలాగే స్వప్నలిపిని చదవటం వచ్చు. ఆయన రాసిన కవిత అది" అన్నాను..

"నేను వ్యాపారస్తుణ్ణి, చేతిపనుల వాడిని. నాకీ కవిత్వాల సంగతి తెలియదు. నావరకు అన్ని దృశ్యాలు ఒక్కలాగే కనిపిస్తాయి. నల్లటి మరక లాగా. అందులో చెట్లు ఉండవు. అవి పెరగటం లేదా కూలిపోవటం ఏమీ ఉండవు" అంటూ ఫిలాసఫీలోకి వెళ్ళిపోయాడు అజంతా. నాకు దిగులేసి, ఇష్టంవేసి, అతని భుజంపై చెయ్యివేసి "ఐ లవ్ యూ" అన్నాను సినిమాల్లో లాగ. "ముందు నువ్వా టెన్త్ పాసవ్వు" అన్నాడు తన వేదాంతధోరణిని కొనసాగిస్తూ.

'నిర్వాణ-401'లో సుందర అంకుల్ ఉన్నాడు. ఆయనా నా ఫ్రెండే. జనన మరణాల రిజిస్ట్రార్ ఆఫీసులో ఆయన ఉద్యోగం. 'ఆయన గొప్ప నటుడు' అని నాన్న చెబుతూ ఉండేవాడు. ప్రస్తుతం టీవీ సీరియల్‌లో ముసలి తండ్రిగానో, జడ్జిగానో మాత్రమే కనిపిస్తుంటాడు. ఆయన పక్కన కూర్చుంటే ప్రపంచ రంగస్థలాన్ని చూసినట్టే ఉంటుంది. హఠాత్తుగా ఆయన మాక్‌బత్‌లానో, కింగ్ లియర్‌లానో లేదా హామ్లెట్‌లానో మారిపోతాడు. షేక్స్‌పియర్ నాటకాలన్నీ కంఠతా వచ్చు ఆయనకు. అట్లా నిముషాల్లో రకరకాల మనుషులుగా మారిపోవటం అద్భుతంగా ఉంటుంది.

"నా దగ్గర మంత్రపు మాస్క్ ఉంది. ఒకసారి దాన్ని తొడుక్కొంటే మరింక నేను సుందర్‌ను కాను!" అంటాడు. కళ్ళు సరిగా కనబడని భార్య. ఉద్యోగం రాక, వయసు దాటిపోయి, వీధి రౌడిలా మారిపోయిన కొడుకు - ఈమధ్యనే ఆయనో గవర్నమెంటు నాటకాన్ని ప్రాక్టీసు చేస్తున్నాడు. 'ప్రజల కొరకు పాలన' దాని పేరు. అందులో సుందర అంకుల్ సి.యం. వేషం వేస్తున్నాడు.

సుందర అంకుల్ నిజానికి నాకు బస్ ఫ్రెండ్. వాళ్ళ ఆఫీసు, మా స్కూలు ఒకచోటే - ఇద్దరం కలిసి వెళుతుంటాం. "ఆఫీసుకు రా. గాంధీల్ని, నెహ్రూల్ని, హిట్లర్లని చూపిస్తాను మా కంప్యూటర్‌లో" అని ఊరిస్తుంటాడు. ఒకసారి ఫ్రెండ్స్‌తో పాటు సుందర అంకుల్ ఆఫీసుకు వెళ్ళాను. కంప్యూటర్ ఆన్ చేసి 'నియంతల వివరాలు' అంటూ టైపు చేశాడు. హిట్లరు, ముస్సోలినీ - వాళ్ళ ఫోటోలు, జీవిత విశేషాలు, జనన మరణాలు కనిపించాయి. "భూమిపై నియంత ఎవరు?" అంటూ టైపు చేశాము. పోలికలు పట్టలేని ఆరునెలల శిశువు స్క్రీన్‌పైకి వచ్చింది. జననం 2025, ఫిబ్రవరి 6 అంటూ. 'ఆఖరి' నియంత అంటే మరింక మానవజాతి ఉండదా? లేదా నిరంకుశత్వం బానిసత్వం పూర్తిగా నశిస్తాయా అన్నాను. సుందర అంకుల్ అర్థం కానట్టు ముఖం పెట్టాడు.

నాకున్న మరో ఫ్రెండ్, నాన్న పనిచేసే ఏనిమల్ లాబరేటరీలోని ఆవు. దానికి నేను మాయ అని పేరు పెట్టాను. చాలా ఎత్తుగా, తెల్లటి కొండలా ఉంటుంది. గ్రోత్ హార్మోన్లు ఎక్కువగా ఇచ్చి, మాయను రెండు ఏనుగులంత సైజుకు పెంచారు. ప్రతిరోజు లంచ్‌టైములో మాయ దగ్గరకు వస్తుంటాను. కూరలు, పళ్ళు, గుగ్గిళ్ళు పెడుతుంటాను. మాయకు ఇప్పుడిప్పుడే బర్గర్‌లు, పిజ్జాలు అలవాటు చేస్తున్నాను. కోక్ కూడా.

ఇవి కాకుండా ప్రతిరోజూ మాయ పక్కన కూర్చొని న్యూస్‌పేపరు చదివి వినిపిస్తుంటాను. అట్లాగే రాత్రి టీవీలో న్యూస్ ఐటమ్స్ కూడా చెబుతుంటాను. మాయ బిబిసి 'హార్డ్‌టాక్' గురించి ఇష్టంగా వింటుంది. మాయకు పౌరహక్కుల వాళ్ళ బులిటెన్లు, ఫెమినిస్ట్ కవితలు వినిపిస్తుంటాను. మాయకు బోస్నియా గురించి చెబుతాను. అక్కడ జరిగిన సామూహిక మానభంగాల గురించి చెబుతాను. కాళ్ళదాకా నరికివేయబడ్డ ఒక పాపను గురించి చెబుతాను. మాయకు డిసెంబరు ఆరు గురించి, నిన్న మొన్నటి తెహల్కా టేపుల గురించి కూడా చెబుతాను. విలియం సార్ హత్య గురించి రోజూ కొద్దికొద్దిగా చెబుతుంటాను.

స్కూలు నుంచి వచ్చేటప్పుడు నాన్నతో కలిసి వస్తాను. ఏనిమల్ సెంటర్‌కు వెళ్ళేసరికి నాన్న తెల్ల యూనిఫారంలో ఉంటాడు. చుట్టూ నాలుగైదు కుక్కలు ఉంటాయి. ఈరోజు మాత్రం నాన్న ఒక్కడే తన గదిలో పచార్లు చేస్తున్నాడు.

హత్యపై న్యాయ విచారణ వచ్చే సోమవారమేనట. సాక్ష్యం చెప్పడానికి కాలనీలో ఎవరూ ముందుకు రావటంలేదు. నాన్నకు కూడా పొద్దున్నే ఫోన్ వచ్చిందట నోరు తెరవడానికి వీల్లేదని.

"ఏం చేస్తావు?" అడిగేను నేను.

"నువ్వైతే ఏం చేస్తావురా?"

"మొత్తం చెప్పేస్తాను. మొదటి సాక్ష్యం నేనే అవుతాను!" అన్నాను ఉద్రేకంతో.

"బహుశా ఉద్యోగం పోవచ్చు. బహుశా మన పైనా దాడి జరగొచ్చు. బహుశా నేను చచ్చిపోవచ్చు" నాన్న గొంతు బొంగురు పోయింది. హఠాత్తుగా నాన్న ముఖంలో దుఃఖం రగిలి "నేను చచ్చిపోతే మీరిద్దరూ ఏమైపోతారు రా?" అంటూ ఏడ్చాడు. నేను కంగారుపడ్డాను.

"నాన్న చచ్చిపోతే..." అంటూ డిబేట్‌లో అంశంలా అయిదు నిముషాలు మాట్లాడాలనిపించింది. "అజంతా వస్తానంటున్నాడు. సుందర అంకుల్‌ని కూడా అడుగుదాం" అన్నాను. ఆయనకు ధైర్యం చెబుదామని.

"అజంతా గుడ్డివాడు. సుందర్ గవర్నమెంటు ఏజెంటైనాడు" అన్నాడు దిగులుగా.

ఇద్దరం ఏనిమల్ లాబ్‌లోంచి బయటకు నడిచాం. వస్తూ వస్తూ మాయ దగ్గర ఆగి, తన చెవులో 'ఇదీ మన న్యాయవిచారణ పరిస్థితి' అని గొణిగి వచ్చాను.

తోవలో పార్కు దగ్గర ఆగాము. స్కూటర్ పార్క్ చేసి లోపలికి నడిచాము. వేరు సెనక్కాయలు కొనుక్కొని, ఒక మూలన కూలబడ్డాము. దూరంగా పిల్లల కోలాహలం. క్రికెట్ ఆట. నాలుగైదు చోట్ల. అమిత ఉత్సాహం. గొప్ప క్రీడోత్సవం. హఠాత్తుగా నాన్న గొంతు సర్దుకొన్నాడు. పెద్ద పెద్ద విషయాలేవో మాట్లాడడం మొదలుపెట్టాడు. ఆయన బాల్యం గురించి చెప్పాడు. డబ్బులు చాలక, మధ్యలోనే చదువు ఆపేసిన విషయం. వాళ్ళ నాన్న చేస్తున్న వెట్టి ఉద్యోగంలోనే చేరి - ఆ విషయాలన్నీ చిన్నచిన్న వివరాలతో సహా చెబుతున్నాడు. మధ్యలో ఆయననెంతో కదిలించిన 'స్పార్టకస్' సినిమా గురించి చెప్పాడు. దళిత ఉద్యమాల గురించి, బహుజన రాజకీయాల గురించి చెప్పాడు. ఆ చెప్పే విషయాలు లోతుగా, గాఢంగా - బహుశా లోపలెక్కడో జారిపోయిన సంగతుల్ని వెలిక్కి లాగుతున్నట్లుగా - ముఖం ఎర్రగా మారి, బాగా చెమట్లు పట్టి, 'రిలాక్స్ డియర్!' అంటూ ఆయన చేతిని ప్రేమగా వత్తాను. గట్టిగా నిట్టూర్చి ఇక వెళ్దాం అంటూ లేచాడు.

ఇంటి దగ్గర అమ్మ ఒక్కతే బయట నిలబడి ఉంది. బర్డ్‌హౌస్ లోపలా బయటా పది, పదిహేను కాకులు కొలువు తీరి ఉన్నాయి. బర్డ్‌హౌస్‌పై నాన్న ఎండిన కొమ్మ, చెట్టు ఆకారంలో ఉండేదాన్ని పెట్టాడు. దానిపై వరుసగా

నిలబడి, గొప్ప పెయింటింగ్‌లా ఉంటుందా దృశ్యం. నాన్న రావడంతోటే గుర్తు పట్టినట్లుగా అరవటం మానేస్తాయి. ఆ నిశ్శబ్దం గొప్ప థ్రిల్‌గా ఉంటుంది. కాసేపు షికారుకెళ్ళి రమ్మని, వాటిని చేతితో అదిలిస్తాడు. నల్లటి రెక్కల్ని విప్పి, గొప్ప ఆనందంతో పైకి లేస్తాయవి.

న్యాయ విచారణ గురించి, సాక్ష్యం చెప్పటం గురించి అమ్మానాన్న చాలా పొద్దుపోయే దాకా మాట్లాడుకొంటూనే ఉన్నారు. "ఎందుకో భయంగా ఉంది లలితా" అంటూ నాన్న అమ్మ భుజంపై తల పెట్టుకోవడం, గొప్ప రొమాంటిక్‌గా ఉందా దృశ్యం.

మాయ కోసమని బిబిసిలో హార్డ్ టాక్ చూస్తూ నిద్రలోకి జారుకొన్నాను.

* * *

ఆ సోమవారం –

ఎప్పటిలాగే నాన్నతో పాటు ఐదింటికి నిద్ర లేచాను.

అవే కాఫీ పరిమళాలు, అదే ఉదయం. పల్చటి మబ్బు తెర. వెలుగింకా రాలేదు. కాఫీ కప్పు తీసుకొని "గుడ్‌మార్నింగ్ డాడీ!" అన్నాను. మౌనంగా ఉన్నాడు ఆయన బిగుసుకుపోయినట్టు. భీకరమైన చలిలో శరీరం మొత్తంగా గడ్డగట్టిన మనిషిలా – "రాత్రి నీకేమైనా గుర్తుందా?" అన్నాడు నావైపు చూసి. లేదంటూ తల ఊపాను.

"బయటకు వెళ్ళి బర్డ్‌హౌస్ ఒకసారి చూసిరా" అన్నాడు. కంగారుగా బయటకెళ్ళాను. గడపలో అమ్మ బిడ్డలు చనిపోయిన తల్లిలా కూర్చొని ఉంది. తలుపు తెరిచి చూస్తే – కాకులన్నీ చచ్చిపోయి ఉన్నాయి. కత్తులతో మెడల్ని కోసి, కొమ్మపైన వేలాడదీసి – గుండెల నెవరో పిసికినట్లయింది. వణుకుతూ నాన్న దగ్గరకు వెళ్ళాను. నాకు పెద్దగా ఏడ్పు వచ్చింది. నాన్న వడిలో తల పెట్టుకొని – ఏడు దాటింది. అపార్ట్‌మెంట్లు అన్నీ చచ్చిపోయినట్లుగా ఎవరూ తలుపు తెరవలేదు. పాల పాకెట్లు, న్యూస్‌పేపరు కుర్రాళ్ళు, కూరగాయలవాళ్ళు, బడికెళ్ళే పాపాయిలు – ఊహు, ఏ అలికిడీ లేదు. కాలనీ మొత్తం మరణాన్ని నటిస్తుంది. రెండు జీపులు రోడ్డుపైన పెట్రోలింగ్ చేస్తున్నట్లు – జీపుల్లో ఎవరున్నారో కనబడటంలేదు. జీపు ఒక బెదిరింపులాగా – ఆజ్ఞలాగా – ఫత్వాలాగా – వందలమంది పౌరుల్ని శాశిస్తున్న కొత్తరకం నియంతల్లా – నాలో కసి, కోపం కలిగాయి. శరీరం బరువు బరువుగా సంకెళ్ళలో తగిలించినట్లుగా –

పదిగంటల సమయంలో టక్‌టక్ మంటూ చిరపరిచితమైన శబ్దం. అజంతా చేతికర్ర. లేచి, జుట్టు పైకి కట్టుకొని, తూనీగలాగా కిందకు నడిచాను.

అజంతా బయట మెయిన్‌గేటు దగ్గర నిలబడి ఉన్నాడు. గేటు తలుపు దగ్గరకు రాగానే, లావాటి చెయ్యి ఒకటి అజంతా ముఖంపై ఫట్‌మని తగిలింది. దబ్బు మని వెనక్కుపడ్డాడు. కళ్ళజోడు, చేతికర్ర పక్కకు జారిపడ్డాయి. పరిగెత్తుకొని వెళ్ళి అజంతాను పైకి లేపాను. వెనక్కు 'కర్మ-104'కి వచ్చాము. 'ఏంటది? ఏం జరుగుతోంది?' అజంతా తనలో తాను గొణుక్కొంటున్నాడు. రెండుమూడు గంటలపాటు ఇద్దరం మౌనంగా అట్లాగే కూర్చున్నాం. మాటలేమీ దొరకనట్లుగా. పన్నెండు గంటలప్పుడు, అజంతా వయొలిన్ తీసుకొని బయట కారిడార్‌లోకి వచ్చాడు. వయొలిన్‌కి మైక్రోఫోన్లు తగిలించాడు. బోయ్‌మంటూ పెద్ద శబ్దం. అపార్ట్‌మెంట్లన్నీ మారుమోగింది. రెక్వియమ్, శవం వెనుక పాడే పాటలాగా గుండెల్ని పిండివేస్తుందా పాట. అపార్ట్‌మెంట్లలోంచి ఒక్కొక్క తలుపే తెరుచుకొని - ముఖాలు బయటకు పెట్టి చూస్తున్నారు. దూరంగా ఎక్కడో మైకులో నుంచి ఎనౌన్సుమెంటు. విలియం హత్యపై జస్టిస్ రామన్ న్యాయ విచారణ ఎమ్మార్వో ఆఫీసులో జరుగుతుందని -

అజంతా వయొలిన్ దుఃఖపు పాట అట్లా కొనసాగుతూనే ఉంది. గంట, రెండు గంటలు - పూనకం పట్టినవాడిలా అట్లా వాయిస్తూనే ఉన్నాడు. భీకరమైన మరణ సంగీతం, విరామం లేకుండా -

సాయంకాలం ఏడు గంటల సమయంలో పది జీపులు అపార్టుమెంటు ముందు వచ్చి ఆగాయి. టౌన్ హాల్లో 'ప్రజల కొరకు పాలన' నాటక ప్రదర్శన అని, అపార్ట్‌మెంట్‌లోని వాళ్ళ కోసం జీపులు ఏర్పాటు చెయ్యబడ్డాయని, అందరూ తప్పనిసరిగా రావాలని.

ఉదయం ఇళ్ళలోంచి బయటకు రావద్దన్న వాళ్ళే - ఇప్పుడు బయటకు రమ్మని ఆజ్ఞాపిస్తున్నారు.

"మనం కనీసం ఈ నాటకాన్నైనా ఆపివెయ్యాలి!" అన్నాడు అజంతా ఉద్రేకంతో. "ఎట్లా ఆపగలం!" "అరుద్దాం. కేకలు వేద్దాం. నాటకాన్ని బహిష్కరించమని జనాన్ని కోరుదాం. కనీసం మనిద్దరం నాటకం చూడకుండా బయట కొద్దాం."

అపార్ట్‌మెంట్లకు తాళాలు వేసి అందరూ బయటకు వస్తున్నారు. ప్రతి ఫ్లోర్‌కీ నలుగురు రౌడీల చొప్పున నిలబడి అందర్నీ బయటకు రమ్మని కేకలు వేస్తున్నారు.

నాన్న ముఖం ఎర్రగా కందిపోయి ఉంది. "రెండు అవమానాలు, రెండు మరణాలు. ఇంకా ఎన్ని ఎదురుకానున్నాయో..."

నాన్న చేతిలో బుట్ట ఉంది. "నా అసంఖ్యాకమైన సంతానం. నా పదహారుమంది పిల్లలు హత్య చెయ్యబడ్డారు" అన్నాడు రుద్ధమైన కంఠంతో.

పదహారు కాకుల శవాలు. "నాటకం దగ్గరే అంత్యక్రియలు చేస్తాను" అన్నాడు సీరియస్‌గా.

రాత్రి ఎనిమిదికి 'ప్రజల కొరకు పాలన' నాటకం. ఆడిటోరియం కిక్కిరిసి ఉంది. నాన్న, మరో నలుగురు ఆడిటోరియం బయట నిలబడి, "నాటక ప్రదర్శన ఆపివెయ్యాలి! బూటకపు న్యాయవిచారణ నశించాలి!" అంటూ నినాదాలు చేస్తున్నారు.

నాకు గొప్ప ఉత్సాహం కలిగింది. అజంతాను లాక్కు వచ్చి గుంపులో కలిపాను. కాసేపటికి వేడి అందుకొంది. మరో ఇరవైమంది వచ్చి చేరారు. చూస్తుండగానే గుంపు వందకు పైగా చేరింది. నినాదాల హోరులో ఆ ప్రదేశం సజీవమైంది. లోపల నాటకం జరుగుతూనే ఉంది.

తొమ్మిది గంటల సమయంలో అజంతా, నేను ఇంటికి బయలు దేరాం. రోడ్డు మలుపు తిరిగి, రాళ్ళ గుట్టల దగ్గరకు వచ్చేసరికి - ఎవరో తోసినట్లుగా అజంతా ముందుకు పడ్డాడు. తోసినట్లు కాదు తోశారు. "ఏమిటి, ఎవరు, ఏమైంది?" అంటూ అజంతా పెద్దగా అరుస్తున్నాడు. నాకు అరిచే అవకాశం లేదు. ఒకడు నా నోరు మూశాడు. రెండోవాడు శరీరంపై చెయ్యి వేశాడు. భయంతో నా నోరు ఎండిపోయింది. అజంతా పెద్దగా అరుస్తున్నాడు. "ఉత్తరా, ఉత్తరా!" అంటూ. "చిన్నపిల్లరా! మీకు దండం పెడతాను వదిలేయండి!" అంటూ అరుస్తున్నాడు.

* * *

ఉదయాన్నే ఏనిమల్ లాబ్‌కు వెళ్ళాను మాయ కోసం. పాప్‌కారన్‌లు, కారట్‌ముక్కలు పెట్టాను. మాయకు ముందుగా న్యూస్‌పేపరు వార్తలు చెప్పాను. తరువాత న్యాయ విచారణ గురించి, దాని ఫార్సు గురించి చెప్పాను. చివరలో ఒంటరి రోడ్డు గురించి చెప్పాను. పదిహేనేళ్ళ బాలికపై జరిగిన దాడి గురించి చెప్పాను. శరీరమంతా రక్తమయి, భయంతో బిగుసుకుపోయి ఏడవటం కూడా మర్చిపోయిన సంగతి చెప్పాను. సాయంకాలం వరకూ ఆ కథనే పదేపదే మాయకు చెబుతూనే ఉన్నాను.

రాత్రి నేను నిద్రపోతుండగా, నా గదిలో, తెరిచిన కిటికీ లోంచి, సన్నటి గాలి. హాయిగా, మృదువుగా లోపలికి ప్రవేశించింది. బయట ఎక్కడో జల్లు పడుతున్నట్లుంది. తడిసిన భూమి వాసన మనోహరంగా, వెన్నెల తెల్లటి వెండి వస్త్రంలా, అట్లా చంద్రుడిపై నుండి, ఆకాశం పై నుండి ఎగురుకొంటూ వచ్చి - నా పాదాల్ని, ముఖాన్ని, మొత్తం శరీరాన్ని కప్పింది. నా శరీరానికి తగలగానే ధవళవస్త్రం కాస్తా నల్ల వస్త్రంగా మారిపోయింది. ఆ వస్త్రాన్ని అట్లాగే చుట్టుకొని,

గదిలోంచి బయటకొచ్చాను. కిందకు దిగి అపార్ట్‌మెంట్ల మధ్య ఖాళీస్థలంలోకి వచ్చాను. అక్కడ మాయ నిలబడి ఉంది. మాయ శరీరంపై నల్లవస్త్రాన్ని కప్పాను. అజంతాను కేక వేశాను. అజంతా కాలికి బాండేజ్ ఉంది. అట్లాగే కుంటుకొంటూ, చేతిలో వయొలిన్, కమానులతో సహా -

ఇద్దరం మాయపైకి ఎక్కి కూర్చున్నాం. మాయ పైకి ఎగిరింది. అజంతా వయొలిన్ మోగించటమూ మొదలుపెట్టాడు. వయొలిన్ పాడుతూనే ఉంది. ఎక్కడి నుంచో రెండు బుల్లెట్లు - మాయ శరీరమంతా రక్తం. రక్తం ధారలుగా కారుతూనే ఉంది. మాయకు మరింత ఎగిరే శక్తి లేదు. పైకి ఎగరలేక, కిందకు జారలేక, అట్లా భూమికీ, ఆకాశానికీ మధ్య వేలాడుతూ-

*- ప్రజాతంత్ర వర్తమాన సాహిత్య సంచిక, మార్చి 2001*